

కొడంగల్ రూపురేఖలు మార్చాలి

కోస్గి రూరల్: కొడంగల్ నియోజకవర్గం రూపురేఖలను మార్చాలని, అందుకు అధికారులు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కోస్గిలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కొడంగల్ - నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు బీటీ రోడ్లు, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల, వెటర్నరీ కళాశాల, తదితర పనులకు సంబంధించిన 12 శిలాఫలకాలను మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నారాయణపేట, వికారాబాద్ జిల్లాలకు రూ.107.53 కోట్ల నిధులు మంజూరు చేసి, చెక్కును అందించారు. దుద్యాల మండలం పోలేపల్లి గ్రామానికి అడిగిన వెంటనే మహిళాసంఘం భవనాన్ని మంజూరు చేశారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌గారి అమ్మమ్మ గారి ఊరు పోలేపల్లి అని ముఖ్యమంత్రి తెలిపారు. సంఘాలను బలోపేతం చేసుకోవాలని మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. మహిళా సంఘాల వ్యవస్థ మొదటగా పాలమూరులోనే ప్రారంభమైందని, 1995లో దౌల్తాబాద్‌లో గులాబీ మహిళాసంఘం ఏర్పడిందని తెలిపారు. హైదరాబాద్‌కు అమెరికా అధ్యక్షుడు జార్జ్‌బుష్ వచ్చినప్పుడు, ఆయనకు మహిళా సంఘాల గురించి వివరించింది గులాబీ సంఘం వారేనని గుర్తు చేశారు. అందుకు ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు.



మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డిని ప్రకటిస్తున్న సీఎం రేవంత్



స్టాల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సీఎం; చిత్రంలో మంత్రులు

గుండెల్లో పెట్టుకొని.. చూసుకుంటా

- కొడంగల్ ప్రజలు భుజాలపై మోసి సీఎంను చేసి.. గుర్తింపు తెచ్చారు
- పాలమూరు ప్రజలను మోసం చేసినందుకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి
- ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ పాలనలోనే పాలమూరుకు అన్యాయం
- పీఆర్ఎల్ఐ జాతీయ హోదాకు మోదీ ఇచ్చిన హామీపై సమాధానం చెప్పాలి
- చల్లా వంశీచంద్‌రెడ్డిని 50 వేల మెజారిటీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి
- కోస్గి కాంగ్రెస్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



కోస్గి సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'నల్లమల ప్రాంతంలోని కుగ్రామం నుంచి వచ్చిన నన్ను ఆశీర్వదించి.. కొడంగల్ ప్రజలు తమ భుజాలపై మోసి.. సీఎంను చేయడంతోపాటు ఢిల్లీ స్థాయిలో గుర్తింపు తెచ్చారు. ఈ నియోజకవర్గ ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. పాలమూరు గడ్డ అక్కున చేర్చుకుని ఆశీర్వదిస్తే ఈ స్థాయిలో ఉన్నాన'ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించి రూ.4,369 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం కోస్గి పట్టణంలో శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా సమాఖ్య సమీపంలోని మైదానంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌లో నోరు లేకున్నా.. పాలమూరులో ఊరు లేకున్నా.. కరీంనగర్‌లో ఓటమి భయంతో పారిపోయి పాలమూరుకు వస్తే.. కేసీఆర్‌ను ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదించారని, కానీ పదేళ్ల తన పాలనలో పాలమూరుకు ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ అన్యాయం చేశారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ద్వారా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేదని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సాధించుకున్న నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టారని విమర్శించారు. పాలమూరుకు అత్యంత నష్టం చేసే విధంగా ఏపీ సీఎం జగన్ రోజుకు 12 టీఎంసీలు తరలించుకునే విధంగా పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు, రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులకు అవకాశం కల్పించారని, ప్రగతి భవన్‌కు పిలిచి భోజనాలు పెట్టి పంపించారని అన్నారు. రోజా ఇంట్లో పులుసు తిని బలిసిపోయి.. 203 జీవో ద్వారా కృష్ణా నీళ్లను ఏపీకి అప్పగించారని ఆరోపించారు. అభివృద్ధి ముసుగులో పాలమూరును దోచుకుని.. ఓట్ల కోసం మళ్లీ ప్రజా పోరుబాట పేరుతో పాదయాత్ర చేయడానికి వస్తున్నారన్నారు. అంతకంటే ముందు కేసీఆర్ పాలమూరు ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రజలు ఛీత్కరించిన తర్వాత కూడా ఏ మొఖం పెట్టుకుని యాత్రలు చేస్తారని విమర్శించారు. పాలమూరుకు జాతీయ హోదా ఇస్తానని 2014లో మోదీ హామీ ఇచ్చారని, నేటికీ హోదా ఇవ్వకపోడానికి ఈ ప్రాంత నాయకులైన డీకే అరుణ, జితేందర్‌రెడ్డి సమాధానం చెప్పాలని అన్నారు. కిషన్‌రెడ్డి అయిదేళ్లుగా కేంద్రమంత్రిగా ఉండి.. వికారాబాద్- కృష్ణా రైల్వేలైన్‌కు తట్టెడు మట్టి తీయించలేదని ఎద్దేవా చేశారు. సిమెంట్ పరిశ్రమలు, రైల్వేలైన్, కృష్ణానది జలాలు రావాలంటే మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి ఎంపీగా చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కొడంగల్‌లో 50 వేల మెజారిటీ ఇచ్చిన తర్వాత ఇప్పుడు ఇచ్చిన నిధులతో పాటు మరో రూ. ఐదు వేల కోట్లు నిధులతో మరింత అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డిని పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించారు.



సభకు హాజరైన జనం

ఈ ప్రాంతాన్ని పట్టించుకోలే: కోమటిరెడ్డి

కొడంగల్ ప్రాంతం సీఎం రేవంత్‌రెడ్డి వల్ల అందరికీ సుపరిచితమైందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాంతం కరువు, వలసలతో అల్లాడితే పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కారణంగా పట్టించుకోలేదన్నారు. కేవలం గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలను మాత్రమే అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు. కమీషన్ల కక్కుర్తి వల్ల పాలమూరు, నల్గొండ జిల్లాలకు అన్యాయం చేసిన కేసీఆర్ రేవంత్‌రెడ్డి ఎడమకాలి గోటికి సరిపోరని విమర్శించారు. ప్రాజెక్టుల పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.



వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు

నారాయణపేటకు జీవధార: ఉత్తమ్

తన అనుభవంలో ఒకేరోజు నియోజకవర్గానికి రూ.4,369 కోట్లతో నిధులతో పనులను ప్రారంభించుకోవడం ఇదే మొదటిసారని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో కొడంగల్ నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. కొడంగల్‌ను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో ఎత్తిపోతల పథకం నిర్మించాలని తలపెట్టినా పట్టించుకోలేదని అన్నారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం తీవ్ర దుర్భిక్షమైన ఈ జిల్లాకు జీవధారగా నిలుస్తుందని అన్నారు. భూత్పూరు రిజర్వాయర్ నుంచి నాలుగు దశల్లో 7.10 టీఎంసీల మిగులు జలాలతో రూ. 2945.50 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. ముందు ప్రతిపాదించిన లక్ష ఎకరాల ఆయకట్టుకు అదనంగా మరో 30వేల ఎకరాలు చేర్చి.. 1.30లక్షల ఎకరాల ఆయకట్టును నిర్దేశించామని అన్నారు. మొత్తం నాలుగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మిస్తామని అన్నారు. భూత్పూరు నుంచి ఉట్కూరు రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి జాజాపూర్‌కు, అక్కడి నుంచి జయమ్మ చెరువుకు, అక్కడి నుంచి కానుకుర్తి రిజర్వాయర్‌కు నీరును లిఫ్ట్ చేస్తామని అన్నారు. ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

పాలమూరును కృష్ణా డెల్టా చేస్తాం: జూపల్లి కృష్ణారావు

అంచెలంచెలుగా ఎదిగి.. రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు సాగునీటి ప్రాజెక్టులతో పాటు.. విద్యా, వైద్య, రోడ్ల సదుపాయాలను కల్పించేందుకు భారీ నిధులతో శంకుస్థాపనలు చేయడం గర్వంగా ఉందని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరును మరో కృష్ణా డెల్టాలాగా మారుస్తామని అన్నారు.

మరో జలయజ్ఞం: వంశీచంద్‌రెడ్డి

పాలమూరులో ప్రస్తుతం నీరందిస్తున్న ప్రాజెక్టులన్నీ- కాంగ్రెస్ జలయజ్ఞంలో చేపట్టినవేనని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపనతో రాష్ట్రంలో మరో జలయజ్ఞం ప్రారంభమైందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డి బలాన్ని ఇంకా పెంచాలని కోరారు. ఈ సభలో ఎమ్మెల్సీలు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి జడ్పీ చైర్మన్లు సునీత, సరిత తిరుపతయ్య, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, తూడి మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, రాజేష్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, మందుల సామెల్, మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏలో గ్రీవెన్స్‌డే

- అధికారులతో ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి సమీక్ష సమావేశం



అధికారులు, చెంచు సంఘం నాయకులతో సమావేశమైన పీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మన్ననూర్, ఫిబ్రవరి 21: చెంచుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఇక నుంచి ప్రతీ బుధవారం మన్ననూరు ఐటీడీఏ కార్యాలయంలో ప్రజా దర్బార్(గ్రీవెన్స్ డే) నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో రోహిత్ గోపిడి తెలిపారు. 'మన్ననూరు ఐటీడీఏకు మహర్దశ లభించేనా' అనే శీర్షికన ఈ నెల 20న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పీవో స్పందించారు. ఈ మేరకు బుధవారం మన్ననూరులోని ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు, ఆదివాసీ, చెంచు నాయకులతో వేర్వేరుగా సమీక్షా సమావేశాలను నిర్వహించారు. చెంచు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జన్‌మన్ పథకం పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. చెంచు పెంటల్లో ఆధార్‌కార్డులు అందరికీ అందేలా చూడాలని చెప్పారు. వేసవిలో తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల వీటీడీఏలతో చర్చించి, అభివృద్ధి కోసం ముందుకు సాగుతామన్నారు. ఆదివాసీల అతిపెద్ద జాతర అయిన సమ్మక్క, సారలమ్మ జాతరకు నల్లమల ఆదివాసీల తరఫున మన్ననూరు ఐటీడీఏ నుంచి పసుపు, కుంకుమ, చీర, సారెలను చెంచు పెద్దలు, ఆడపడుచుల ద్వారా పంపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నల్లమలలోని భౌరాపూర్‌లో మహాశివరాత్రి రోజు జరిగే చెంచుల జాతర, సలేశ్వరంలో జరిగే లింగమయ్య ఉత్సవాలను ఐటీడీఏ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. సమావేశంలో డీటీడీవో కమలాకర్ రెడ్డి, ఐటీడీఏ ఏవో జాఫర్ హుసేన్, డిప్యూటీ ఈవో శంకర్ నాయక్, ఐకేపీ ఏపీడీ లక్ష్మయ్య, మన్ననూరు ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, చెంచు సంఘాల నాయకులు రాజేంద్ర ప్రసాద్, చిర్ర రాములు, పెద్దిరాజు, గురువయ్య, లింగయ్య పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో.. వస్త్ర దుకాణం దగ్ధం

- వస్త్రాలు, ఇంటి నిర్మాణం కలిపి రూ.80 లక్షల ఆస్తినష్టం



ఇంటి పైకప్పు తొలగించి మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 21: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని చిన్నఅగ్రహారం కాలనీలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న వస్త్ర దుకాణంలో బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.80 లక్షల ఆస్తినష్టం సంభవించింది. బాధితులు, ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న అగ్రహారం కాలనీలో ప్రవీణ్ ఇంట్లో చంద్రబాబు అనే వ్యక్తి కొంత కాలంగా వస్త్ర దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో దుకాణంలో మంటలు వచ్చాయి. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చారు. ఇంటి గదులు చిన్నవిగా ఉండటం, వాట్లతో కూడిన పైకప్పు ఉండటంతో ఫైర్ సిబ్బందికి లోపలికి వెళ్లేందుకు వీలు కాలేదు. పైకప్పు కూలిపోయే స్థితికి రావడంతో పైకప్పు తొలగించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే వస్త్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇల్లు కూడా పూర్తిగా దెబ్బతింది. వస్త్ర దుకాణం, ఇంటి నిర్మాణం మొత్తం కలిసి రూ.80 లక్షల దాకా ఆస్తినష్టం సంభవించినట్లు ప్రవీణ్, ఫైర్ సిబ్బంది గౌస్‌పాష చెప్పారు. తమకు సమాచారం వచ్చిన వెంటనే అక్కడికి వెళ్లడం వల్ల పక్కన ఉన్న ఇళ్లకు ఎలాంటి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకున్నామని గౌస్‌పాష చెప్పారు. ఫైర్ సిబ్బంది రాందాస్, లక్ష్మన్ననాయుడు, గౌస్ పాష, ఖాజాపాషా మంటలను ఆర్పారు.

సంఘటనా స్థలం పరిశీలన

వస్త్ర దుకాణం దగ్ధమైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సరిత వెళ్లి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి బాధితుడికి నష్టపరిహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

అనుమానాస్పదంగా కన్పించిన మహిళ

- ఆమె దగ్గరున్న సంచిలో రెండు కత్తులు, గ్లౌజ్‌లు



బ్యాగ్‌లో లభించి కత్తులు

గద్వాల, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని నదీ అగ్రహారంలో బుధవారం రాత్రి ఓ మహిళ అనుమానాస్పదంగా తిరుగుతుండటం గమనించి గ్రామస్థులు అనుమానించారు. ఆమెను ప్రశ్నించగా సమాధానం ఇవ్వకపోగా పరుగులు తీసింది. దీంతో కొందరు యువకులు వెంబడించి ఊరిబయట ఆమెను పట్టుకొని ప్రశ్నించగా, తనది బిహార్ రాష్ట్రం అని హిందీలో చెప్పింది. ఎందుకు వచ్చావని అడగ్గా ఆమె సమాధానం చెప్పలేదు. ఆమె వద్దనున్న సంచిని తనిఖీ చేయగా, రెండు కత్తులు, గ్లౌజ్‌లు ఉండటంతో ఆమె చేతులను కట్టేసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి ఆమెను స్టేషన్‌కు తరలించారు. ఆమె వెంట ఉన్న మరొకరు తప్పించుకు పోయాడని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాస్‌ను అడుగగా, ఆమెకు మతిస్థిమితం లేదని తెలిపారు. ఆత్మరక్షణ కోసం కత్తులు ఉంచుకున్నట్లు చెప్తోందన్నారు.

పాలమూరులో బీజేపీ జెండా ఎగిరితే సమగ్రాభివృద్ధి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన యాత్రలో క్రాకర్ గన్ కాలుస్తున్న మంత్రి కిషన్‌రెడ్డి, డీకే అరుణ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్రమోదీ మూడోసారి ప్రధాన మంత్రి అవుతున్నారని, మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో బీజేపీని భారీ మెజారిటీతో గెలిపిస్తే పాలమూరు సమగ్రాభివృద్ధిని సాధిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో చేపట్టిన బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు మోదీ నినాదంతో హోరెత్తిస్తున్నారని చెప్పారు. విజయ సంకల్పయాత్ర బుధవారం రాత్రి మహబూబ్‌నగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా గడియారం చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారులు అద్భుతంగా మారాయన్నారు. మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరిస్తున్నట్లు చెప్పారు. పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధి కోసం రూ.వంద కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వచ్చే ఐదేళ్ల మోదీ హయాంలో ఆడబిడ్డలు, రైతన్నల సంక్షేమం, యువత భవిష్యత్తు, పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తారని ప్రకటించారన్నారు. అవినీతి, దోపిడీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో పాలమూరు ప్రజలు ఎన్నో అన్యాయాలకు గురయ్యారన్నారు. కాంగ్రెస్ హయాంలో మత కలహాలు, హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లు జరిగాయని, మోదీ పాలనలో మెరుగైన శాంతిభద్రతలు నెలకొన్నాయని అన్నారు. 500 ఏళ్ల క్రితం ఆక్రమించి ఒక నిర్మాణం చేపట్టారని, రాముడి జన్మ స్థలంలో మోదీ హయాంలో తిరిగి బాలరాముడి ప్రాణప్రతిష్ఠ చేసుకోవటం జరిగిందన్నారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పాలమూరు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే మహబూబ్‌నగర్‌లో బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ మాట్లాడారు. బంగారు శృతి, ఏపీ మిథున్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పడాకుల బాలరాజు, అచ్చుగట్ల అంజయ్య రామాంజనేయులు, శివ పాల్గొన్నారు.

మోదీతోనే అవినీతి రహిత పాలన

దేవరకద్ర: : మోదీతోనే దేశంలో అవినీతి రహిత పాలన కొనసాగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర బుధవారం రెండో రోజు దేవరకద్రకు చేరుకుంది. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కోశాధికారి శాంతకుమార్, జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డిలు యాత్రలో పాల్గొన్నారు. పార్టీ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ పశాంత్‌రెడ్డి బైక్ ర్యాలీతో యాత్రకు స్వాగతం పలికారు. కొత్త బస్టాండ్ దగ్గర ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కిషన్‌రెడ్డి మా ట్లాడారు. గత ప్రభుత్వాలు కుటుంబ పాలనతో బాగుపడ్డాయని, ప్రజలే నరేంద్రమోదీ కుటుంబ మన్నారు. డీకే అరుణ మాట్లాడుతూ మోదీ మరోసారి పీఎం కావడమే లక్ష్యంగా విజయ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవరకద్రలో అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని పట్టణ ఆర్యవైశ్యులు కిషన్‌రెడ్డికి వినతి పత్రాం అందజేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ఎంపీ గెలిచిన వెంటనే బ్రిడ్జి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎగ్గని నర్సిములు, సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి నంబి రాజు, మండల నాయకులు పాల్గొన్నారు.



విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి, డీకే అరుణ

ఎన్నికలకు అధికారులు సిద్ధం కావాలి

- కలెక్టర్ ఉదయ్ కుమార్



పార్లమెంట్ ఎన్నికల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 21: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ ఉదయ్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని మండల అధికారి కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎక్కువ ఓట్లు ఉన్నట్లైయితే జాబితాను సవరించి నోటీసు పూర్వకంగా తొలగించి సవరించాలన్నారు. పోలింగ్ బూత్‌లో ఎంఎఫ్ ఫెసిలిటిస్ అన్ని సక్రమంగా ఉండాలని ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ త్వరలో వస్తున్నందున అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఓటరు జాబితాలో అలసత్వం వహించకుండా త్వరితగతిన పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. ఆర్డీవో సుబ్రమణ్యం, అన్ని మండలాల తహసీల్దార్లు, జూనియర్ అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి హంస వాహన సేవ



హంస వాహన సేవలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 21 : తెలంగాణ తిరుపతి మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హంస వాహన సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్, అర్చకులు స్వామివారిని పల్లకిలో ఊరేగించి, గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి శ్రీనువాసరాజు, అడిషనల్ కార్యనిర్వహణ అధికారి శ్రీనువాస్, ఆలయ వంశపార ధర్మకర్త రామకృష్ణ, సూపరింటెండెంట్ నిత్యానందం, ఫెస్టివల్ ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల



డిగ్రీ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21 : యూనివర్సిటీలో యూజీ, పీజీ ఫలితాలు ఇంకా మెరుగుపడాలని పీయూ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ సూచించారు. బుధవారం పీయూలోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణ అధికారి డా.రాజ్‌కుమార్, యూజీ, పీజీ కళాశాలల డైరెక్టర్‌తో కలిసి పాలమూరు యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫలితాలు విడుదల చేశారు. డిగ్రీ మొదటి సెమిస్టర్, మూడో సెమిస్టర్, ఐదో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే ఫలితాలు కొంత పెరిగినా ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, మొదటి సెమిస్టర్‌కు 21,743 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 6,974 మంది ఉత్తీర్ణత సాధించారు. 7,709 మంది పైతరగతులకు ప్రమోట్ అయ్యారు. మూడో సెమిస్టర్‌లో 17,401 మంది హాజరుకాగా, 7,749 మంది ఉత్తీర్ణత సాధించారు. 5,206 మంది విద్యార్థులు పైతరగతులకు ప్రమోట్ అయ్యారు. ఐదో సెమిస్టర్‌లో 13,211 మంది పరీక్ష రాయగా, 6,758 మంది ఉత్తీర్ణత సాధించారు. 4,986 మంది విద్యార్థులు పైతరగతులకు ప్రమోట్ అయ్యారు. పరీక్ష ఫలితాలను పాలమూరు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, విద్యార్థులు చూసుకోవచ్చని తెలిపారు. మార్కులు తక్కువగా వచ్చినట్లు భావించే విద్యార్థులు, ఫెయిల్ అయిన విద్యార్థులు రీవాల్యుయేషన్ కోసం ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కిషన్‌రెడ్డికి స్వాగతం పలికిన పీయూ విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 21 : విజయ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం పాలమూరు యూనివర్సిటీకి వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పీయూ ఏబీవీపీ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పరిపాలనా భవనం వద్ద పీయూ వీసీ అధికారులతో కలిసి కిషన్‌రెడ్డి రాక కోసం వేచి ఉండగా యూనివర్సిటీ విద్యార్థులు, ఏబీవీపీ విద్యార్థులు పరిపాలన భవనం వైపు మళ్లే సర్కిల్ వద్దనే కిషన్‌రెడ్డికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అభివృద్ధి, సమస్యలు, విద్యార్థుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నుంచి వినతి పత్రం తీసుకొని పరిపాలన భవనం వద్దకు రాకుండా అక్కడ్నుంచే తిరిగి వెళ్లిపోయారు. గమనించిన వీసీ వెంటనే సర్కిల్ వద్దకు వెళ్లి కిషన్‌రెడ్డి తదుపరి కార్యక్రమం జరిగే ప్రదేశంలో పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు. విద్యార్థులు ముందే ఆపి స్వాగతం పలకడం ద్వారా కోఆర్డినేషన్ సమస్య వల్ల తప్పిదం జరిగిందని కిషన్‌రెడ్డికి వివరించారు. అనంతరం పీయూకి రూ.వంద కోట్లు మంజూరు చేసినందుకు, మంజూరు కావడానికి కృషి చేసిన కిషన్‌రెడ్డికి, డీకే అరుణకు కృతజ్ఞతలు తెలిపారు. మరోమారు పీయూకి వస్తామని వీసీకి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు.



- లక్షలాదిగా తరలివచ్చిన భక్త జనం
- కిటకిటలాడుతున్న జాతర ప్రాంగణం
- సారలమ్మ రాకతో మొదలైన మహాజాతర
- ప్రశాంతంగా ముగిసిన తొలి ఘట్టం

మేడారం.. జన సంద్రం..

మేడారం బృందం, ఫిబ్రవరి 21: జనం.. జనం ప్రభంజనం. ఎటు చూసినా భక్త జన సంద్రం. అన్ని దారులు మేడారం వైపే. పలు మార్గాల గుండా లక్షలాది భక్తులు మేడారానికి పోటెత్తుతున్నారు. దీంతో బుధవారం రాత్రి వరకు మేడారం పరిసరాలు జనజాతరయ్యాయి. భక్తుల తాత్కాలిక గుడారాలు, చిరువ్యాపారుల అంగళ్లతో సందడిగా మారింది. జాతరకు ఇప్పటికే కోటిమంది వరకు భక్తులు వచ్చినట్లు ప్రాథమిక అంచనా కాగా గురువారం సాయంత్రానికి మరో 50లక్షల మంది వరకు రావొచ్చనని భావిస్తున్నారు. నెలరోజులుగా మేడారానికి వస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకున్న భక్తులు కాక వీరు అదనమని అధికారులు చెబుతున్నారు. ఇక జాతరలో తొలిఘట్టమైన సారలమ్మ రాక.. బుధవారం సాయంత్రం జరగ్గా.. సాయంత్రానికి ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. మేడారంలోకి ప్రవేశించే అన్ని మార్గాల వద్ద మోహరించి.. వాహనాలను నియంత్రిస్తున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, డీసీఎంలు, లారీలు, కార్లు, ఆటోలు తదితర వాహనాల్లో వస్తుండగా.. డ్యూటీ, ప్రత్యేక పాస్‌లున్న కొన్ని వాహనాలను మాత్రమే మేడారంలోకి అనుమతిస్తున్నారు. దీంతో ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారంతా మేడారానికి ఐదు కిలో మీటర్ల దూరంలోని పార్కింగ్ ప్రాంతాల నుంచి మూటాముల్లెలతో కాలినడకన గద్దెలకు చేరుకుంటున్నారు.

దూరప్రాంతాల నుంచి..

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షల మంది మంగళవారం నుంచి మేడారం బాట పట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్ల బండ్లలో తరలివచ్చి మేడారం చుట్టుపక్కల విడిది చేశారు. దీంతో మేడారానికి ఎటుచూసినా 20 కి.మీ. వరకు భక్తుల సందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనమైంది.



సమ్మక్కగద్దె



వనదేవతల రాకతో..

బుధవారం రాత్రి సారలమ్మ రాకతో వనం పులకించిపోయింది. రాత్రి కన్నెపల్లి నుంచి సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్య జయజయధ్వానాల మధ్య తీసుకొచ్చారు. అలాగే పూనుగొండ్ల నుంచి మంగళవారం బయలుదేరిన పగిడిద్దరాజు బుధవారం మేడారానికి చేరుకున్నారు. కొండాయి నుంచి గోవింద రాజులు, నాగులమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తుల మొక్కులు ప్రారంభమయ్యాయి.



కన్నెపల్లి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య



జంపన్నవాగు వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం



జాతరలో జాతకాలు చెబుతున్న కోయదొర

డిగ్రీ కళాశాలను
సందర్శించిన న్యాక్ బృందం



జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న న్యాక్ బృందం

జడ్చర్ల, ఫిబ్రవరి 21 : జడ్చర్ల బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం న్యాక్ బృందం పరిశీలించింది. న్యాక్ బృందం చైర్మన్‌గా కర్ణాటక రాష్ట్రం హసన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ టీసీ.తారానాథ్, కోఆర్డినేటర్ సభ్యుడిగా తిరుపతి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.జయచంద్రారెడ్డి, సభ్యుడిగా అస్సాం రాష్ట్రం జోర్హాట్ జేబీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బిమల్‌బరాహ్‌లు కళాశాలను సందర్శించారు. గత సంవత్సరం మార్చి 15, 16వ తేదీల్లో న్యాక్ బృందం పర్యటించింది. కాగా, కళాశాలలో చేపట్టిన అభివృద్ధికి గుర్తింపుగా కేవలం బి++ గ్రేడ్ రావడంతో, సరైన గ్రేడ్ రాలేదని, పునఃపరిశీలించేందుకు మళ్లీ పర్యటించాలన్న కళాశాల యాజమాన్యం విజ్ఞప్తి మేరకు తాజాగా న్యాక్ బృందం రెండురోజుల పాటు కళాశాలలో పర్యటించనుంది. కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, సదుపాయాలు, వసతులు, తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి, కళాశాలకు కేటాయించాల్సిన గ్రేడ్ అంశంపై సిఫారసు చేయనున్నారు. న్యాక్ బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ అప్పియచిన్నమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులకు బోధిస్తున్న తీరుపై మొదటగా అధ్యాపకులతో సమావేశమయ్యారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడారు. కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రస్తుతం అందిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలతో పాటు అదనంగా కావాల్సిన వాటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను సందర్శించి, హెర్బేరియంను పరిశీలించారు. అనంతరం కళాశాలలోని వివిధ విభాగాధిపతులతో మాట్లాడి, ఆయా విభాగాల ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, విద్యాబోధనను పరిశీలించారు. అనంతరం అలూమ్ని సమావేశ గదిలో పూర్వ విద్యార్థులతో సమావేశం అయ్యారు. కళాశాలకు కావల్సిన సదుపాయాల కోసం అలూమ్ని ద్వారా ఇప్పటికే రూ.66లక్షలకు పైగా వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని అలూమ్ని అధ్యక్ష, కార్యదర్శులు పాలాదిరాంమోహన్, బాదిమి రవిశంకర్‌లు వివరించారు. రెండురోజుల పర్యటనలో భాగంగా గురువారం సైతం బృందం కళాశాలలో పర్యటించనుంది. కళాశాలకు కేటాయించే గ్రేడ్‌కు సంబంధించిన పూర్తి నివేదికను యుజిసికి అందించనున్నట్లు న్యాక్ బృందం తెలిపింది. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్, అలూమ్ని కళాశాల కోఆర్డినేటర్ శ్రీనివాసులు, బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు ధాన్యం తెచ్చే రైతులు ఇబ్బందులు పడొద్దు


రైతులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 21: మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అమ్రాబాద్ జడ్పీటీసీ సభ్యురాలు, ఎమ్మెల్యే సతీమణి అనురాధ అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌ను ఆమె సందర్శించి వేరుశనగ రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌లో ఉచిత అన్నదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చే రైతులకు సమస్యలు లేకుండా అధికారులు చూడాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే రైతులను అడిగి తెలుసుకొని తక్షణమే పరిష్కరించేలా చూడాలన్నారు. వేరుశనగ రైతుల ధర విషయంలో ఎలాంటి అన్యాయం జరగదని పల్లీలను బట్టి మార్కెట్‌లో ధర నిర్ణయిస్తారన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ సిబ్బంది శాలువాతో సత్కరించారు. అదేవిధంగా పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసి ఫెర్వెల్ పార్టీలో పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. కౌన్సిలర్లు గౌరీశంకర్, సునిత, వ్యవసాయ మార్కెట్ అధికారులు నర్సింహ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌తో ఉద్యోగ ఉపాధి అవకాశాలు


క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి స్వాములు

కల్వకుర్తి, ఫిబ్రవరి 21 : అథ్లెటిక్స్ క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు అన్నారు. కల్వకుర్తి పట్టణ సమీపంలోని సీబీఎం కళాశాల ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్‌ను డాక్టర్ సోలపోగుల స్వాములు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ సెలక్షన్స్‌కు అండర్-14, 16,18, 20 విభాగాల్లో 150మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరందరిలో పది మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్వాములు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25న ఔటరు రింగ్ కొల్లూరు సమీపంలోని గాడియం స్పోర్టోపియా స్కూల్‌లో జరగబోయే తెలంగాణ స్టేట్ 400మీ.చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని స్వాములు తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన జాయింట్ సెక్రటరీ పరుశరామ్, పీడీ శంషీర్‌అలీ, పీఈటీలు కరుణాకర్, సుదర్శన్, శంకర్, రాజేందర్, స్వేరోస్ నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

'లెనిన్ జీవితం కమ్యూనిస్టు కార్యకర్తలకు ఆదర్శం'

కోడేరు, ఫిబ్రవరి 21 : లెనిన్ జీవితం ప్రతీ కమ్యూనిస్టు కార్యకర్తకు ఆదర్శమని మండల సీపీఎం కార్యదర్శి పి.నరసింహ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎంకార్యాలయంలో రెడ్‌బుక్‌డే కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. నరసింహ మాట్లాడుతూ కామ్రేడ్ లెనిన్ మార్క్స్ రచించిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టి రష్యాలో విప్లవం ద్వారా సోషలిస్టు వ్యవస్థను స్థాపించిన మహనీయుడన్నారు. సీపీఎం కోడేరు గ్రామ కమిటీ కార్యదర్శి పి.రవి, రాజాపూర్ గ్రామ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ బిచ్చన్న, చికిరాల కుర్మయ్య, రేకులపల్లితండా కామ్రేడ్ నానుచింతం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్య, ఉపాధి అందించడమే లక్ష్యం


విద్యార్థులతో కలిసి పాలిసెట్ కోచింగ్ పోస్టర్లు విడుదల చేస్తున్న ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శశికాంత్ వాల్మీకి

కొల్లాపూర్, ఫిబ్రవరి 21 : కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించి అతి తక్కువ కాలంలో వారికి ఉపాధి అవకాశాలు అందించడమే లక్ష్యంగా కొల్లాపూర్ ఓల్డ్ స్టూడెంట్(కోసా) పని చేస్తుందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శశికాంత్‌వాల్మీకి పేర్కొన్నారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు శశికాంత్ వాల్మీకి సాంకేతిక విద్య, ఉపాధి అవకాశాలపై క్లుప్తంగా అవగాహన కల్పించారు. ఏప్రిల్ 3వ తేదీన కొల్లాపూర్ పట్టణంలో ఉచిత పాలిసెట్ కోచింగ్‌కు అర్హులయ్యేందుకు నిర్వహించే మెరిట్ పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు హైదరాబాద్ కోఠిలో ఉన్న ప్రముఖ కోచింగ్ సెంటర్ శ్రీసాయిమేధా సహకారంతో ఉచిత పాలిసెట్ కోచింగ్‌తోపాటు ఉచితంగా మెటీరియల్, హాస్టల్ వసతి విద్యార్థులకు అందించబడుతుందన్నారు. అనంతరం ఉచిత పాలిసెట్ కోచింగ్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు.

ఎంఈడీలో గోల్డ్‌మెడల్ సాధించిన నల్లమల విద్యార్థిని


శ్వేతను సన్మానిస్తున్న ప్రగతి కళాశాల అధ్యాపకులు

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 21: మారుమూల ప్రాంతమైన నల్లమల నుంచి విద్యార్థులు రాటుదేరుతున్నారు. పోటీ పరీక్షలతో పాటు జాతీయ స్థాయి పరీక్షలలో పోటీ పడి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. పట్టణంలోని ప్రగతి ఎంఈడీ కళాశాలకు చెందిన కపిలవాయి శ్వేత పాలమూరు యూనివర్సిటీ నుంచి గోల్డ్‌మెడల్‌కు ఎంపికైంది. యూనివర్సిటీ స్థాయిలో వివిధ కోర్సులలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్‌ను ప్రకటించారు. పాలమూరు విశ్వవిద్యాలయం ప్రకటించిన 2023 సంవత్సరానికి గాను ఎంఈడీలో 82.25శాతం మార్కులు సాధించిన శ్వేతకు గోల్డ్‌మెడల్ వరించింది. బుధవారం కళాశాల కరస్పాండెంట్ జగపతిరావు, ప్రిన్సిపాల్ ఇబ్రహీం సమక్షంలో గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థిని శ్వేతను ఘనంగా శాలువాతో సత్కరించారు. అధ్యాపకులు మల్లయ్య, వెంకటేశ్వర్లు, ప్రకాష్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరభద్రస్వామి ఊరేగింపు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 21: శివస్వాముల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో వీరభద్రస్వామి ఊరేగింపు, నందికోళ్ల సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివదీక్ష గురుస్వామి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ శివాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం, బస్టాండు, శ్రీపురం చౌరస్తా, నాగనూలు చౌరస్తా, కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు బ్యాండు మేళాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. పాండురంగయ్య బృందం ఆధ్వర్యంలో ఖడ్గాలు, నందికోళ్ల సేవలో శివస్వా ములు శూలాలు గుచ్చుకుని, అరచేతిలో టెంకాయలు పగలగొడుతూ విన్యాసాలు ప్రదర్శించారు.అనంతరం కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద శివస్వాములు సామూహిక అన్న ప్రసాదం స్వీకరించారు. కోటేశ్వర్, రాజారత్నం, వంశీ, రాజు, నాగేశ్వర్, విక్రమ్, వినయ్, శివ దీక్షపరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులతో అస్వస్థత

- ప్రైవేట్ ఆసుపత్రి ముందు రోగి బంధువుల ఆందోళన

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 21 : కాలం చెల్లిన మందులతో రోగి తీవ్ర అస్వస్థత, తీవ్ర వాంతులు కావడంతో రోగి బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళన చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో శశి ఆర్థో హాస్పిటల్‌లో వెన్నెముక నొప్పితో బాధపడుతున్న జిల్లా కేంద్రానికి చెందిన రోగి మహ్మద్ మక్దూమ్ బుధవారం ఆసుపత్రిలో ఆర్థో వైద్యుడు మహేష్ వద్ద వైద్య చికిత్సలు చేయించుకున్నారు. అదే ఆసుపత్రిలో కొనసాగిస్తున్న ఫార్మసీలో కాలం చెల్లిన మందులను ఇచ్చారు. వాటిని తీసుకెళ్లి రోగి ఇంటి దగ్గర మందులు వేసుకోగా ఐదారుసార్లకు పైగా వాంతులయ్యాయి. తక్షణమే మళ్లీ ఆసుపత్రికి వచ్చి వైద్యున్ని సంప్రదించగా వైద్యుడు దాటవేశారు. తీరా మందులను చూస్తే కాలపరిమితి చెల్లినవి ఉన్నాయి. దీంతో స్థానికులు సర్ది చెప్పి రోగికి మరో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నందించారు. వైద్యున్ని గట్టిగా నిలదీయడంతో ఆసుపత్రి నుంచి సమాధానం చెప్పకుండా వెళ్లిపోయాడు.

జనరల్ ఆసుపత్రి శానిటేషన్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్


జిల్లా ఆసుపత్రి ఆవరణంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, పారిశుధ్య కార్మికులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 21: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పని చేసే శానిటేషన్ ఏజెన్సీ అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పారిశుధ్య కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎస్.ఎస్.సీ అనే శానిటేషన్ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ నియమించుకున్న సిబ్బంది నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించకుండా కార్మికుల పొట్ట కొడుతోందని ఆరోపించారు. జీవో నెంబరు 60 ప్రకారం రూ.10,500 చెల్లించాల్సి ఉన్నా 2017 నుంచి ఇప్పటి వరకు రూ.7500 చెల్లిస్తూ అవినీతికి పాల్పడుతోందని పేర్కొన్నారు. ఇచ్చే వేతనాలు కూడా సకాలంలో చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందని, ప్రశ్నించిన కార్మికులను దూషిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి జిల్లా జనరల్ ఆసుపత్రి ఏజెన్సీ అవినీతిపై విచారణ జరిపించి కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు పెట్టడంతో పాటు ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్త ఏజెన్సీలను నియమించి జీవో నెంబరు 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, నాయకులు శ్రీనివాస్, బాలపీరు, ఆసుపత్రి పారిశుధ్య సిబ్బంది మణెమ్మ, గౌరమ్మ, మహేశ్వరి, అలివేల, బురాన్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం


మేడిపూర్‌లోని వెంకట్‌రెడ్డి అనే రైతుకు సంబంధించిన ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న జాతీయ స్థాయి శాస్త్రవేత్తల బృందం

తాడూరు, ఫిబ్రవరి 21 : మండలంలోని మేడిపూర్ గ్రామంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి అనే రైతు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను బుధవారం జాతీయ స్థాయి ఉద్యానవన శాఖ శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఆయిల్‌పామ్ తోట సాగుకు సంబంధించి రైతు వెంకట్‌రెడ్డితో వివరాలను సేకరించి చాలా ఆరోగ్యవంతమైన మొక్కలు వయస్సుకు తగిన ఎదుగుదల ఉందంటూ ప్రశంసించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ శాస్త్రవేత్త డాక్టర్ సురేష్, ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ ప్రిన్సిపాల్ సైంటిస్టు రామచంద్రుడు మాట్లాడుతూ ప్రస్తుతం భూసార పరీక్ష వివరాల ఆధారంగా ఆయిల్‌పామ్ పంటను సాగు చేసి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని వారన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయిల్‌పామ్‌కు మంచి డిమాండ్ ఉందని అందుకనుగుణంగా రైతులు ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, సలహాల మేరకు జాగ్రత్తలు తీసుకుని మంచి దిగుబడి సాధించేందుకు కృషి చేయాల్సిందిగా సూచించారు. రైతు వెంకట్‌రెడ్డి, ప్రియునిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టెక్నికల్ మేనేజర్ ఫణికుమార్, ఏరియా మేనేజర్ రాకేష్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు , కంపెనీ సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి


జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 21: ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే వైద్యులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి వార్డులు, పరిసరాలను పరిశీలించి అపరిశుభ్రం కనిపించడంతో పాటు టాయిలెట్స్ తాళం వేసి ఉండడంతో సూపరింటెండెంట్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో పని చేసే శానిటేషన్ సిబ్బంది మాజీ ఎమ్మెల్యే హయాంలో నియమితులు కావడం వల్ల వారు ఉద్దేశపర్వకంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి రావడంతో ప్రభుత్వ విభాగాల్లో రాజకీయాలను సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రిలో వైద్య సేవలతో పాటు మౌలిక వసతులు, పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన వెంట ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే

తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా చెన్నకేశవస్వామి దేవాలయానికి సంబంధించి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందుకు సంబంధించి బుధవారం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరై ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించే ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. జడ్పీటీసీ సభ్యురాలు రోహిణి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, చిన్నపురెడ్డి, నరేందర్‌రెడ్డి, ఫ్రాన్సిస్‌రెడ్డి పాల్గొన్నారు.

వేరుశనగలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు సింగారెడ్డి, పద్మహర్ష

- నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ తనిఖీ


నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగను పరిశీలిస్తున్న రాష్ట్ర ఉప సంచాలకులు సింగారెడ్డి, పద్మహర్ష

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 21: అమ్మకానికి మార్కెట్‌కు తెచ్చే వేరుశనగ పంట నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధరలను నిర్ణయించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ ఉప సంచాలకులు బి.సింగారెడ్డి, పద్మహర్ష మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు సందర్శించి అమ్మకానికి తెచ్చిన వేరుశనగ పంటను పరిశీలించారు. వేరుశనగ క్రయ విక్రయాలు, వాటి ధరలపై వ్యాపారులు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సీజన్‌లో వేరుశనగకు దాదాపు రూ.7 వేల వరకు ధర లభించిందన్నారు. ఒకవేళ తక్కువ ధర వచ్చిన సరుకును మార్కెటింగ్ అధికారులు పరిశీలించి నాణ్యతా ప్రమాణాలను అనుసరించి రైతులకు మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు మార్కెట్‌కు తెచ్చే పంటలో మట్టి, తాలు లేకుండా తీసుకురావాలన్నారు. మార్కెటింగ్ సిబ్బంది కమీషన్‌దారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి తేమ, నాణ్యత విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా మార్కెటింగ్ అధికారిణి జి.బాలమణి, మార్కెట్ కమిటీ సెక్రెటరీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం


కల్వకోల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలసాహిత్యానికి సంబంధించిన పుస్తకాన్ని అందజేస్తున్న మధుసూదన్‌శర్మ

కొల్లాపూర్, ఫిబ్రవరి 21 : కొల్లాపూర్ పట్టణంలోని పీజీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ అమృత్‌కుమార్, అనిల్‌కుమార్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హైదరాబాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ని భాషల పరిజ్ఞానం సంపాదించుకున్నప్పటికీ మాతృభాషలో మాట్లాడడం అమృతం కన్న తియ్యనైనదని దాని వెలకట్టలేని సంతోషాన్ని సంబంధాలు మెరుగుపరుస్తుందని వారు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియత్ మాట్లాడారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తెలకపల్లి: మాతృభాషా దినోత్సవం మండల కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ స్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా పండితులు ఆంజనేయులును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్, తెలుగు పండితుడు ఆంజనేయులు మాట్లాడుతూ మాతృభాషను మరువరాదని మాతృభాష వచ్చి ఉంటే ఇతర భాష నేర్చుకోవడం చాలా సులభమన్నారు. పక్క రాష్ట్రమైన తమిళనాడులో వారి మాతృభాష కోసం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నారని మన భాషను కూడా అభివృద్ధి చేసుకోవాలని వారన్నారు.

మాతృభాషా మాధుర్యాన్ని విద్యార్థులకు పంచాలి

● పెద్దకొత్తపల్లి : విద్యార్థులకు మాతృభాషలోని మాధుర్యాన్ని ఉపాధ్యాయులు పంచాలని తెలుగు భారతి సాహిత్య సంస్థ ప్రధాన కార్యదర్శి సాహితీవేత్త వేదార్థం మధుసూదన్‌శర్మ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం పురస్కరించు కుని బుధవారం కల్వకోల్ ఉన్నత పాఠశాలలో మాతృ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడా రు. అనంతరం పాఠశాల గ్రంథాలయానికి బాల సాహి త్యానికి సంబంధించిన అనేక పుస్తకాలను బహూకరిం చారు. అలాగే విద్యార్థులకు పద్యపఠనం, పద్యకంఠస్థ క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజే శారు. ఆ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం. శ్రీనివాసులు, ఉపాధ్యాయులు శివకుమార్, వెంకటస్వామి, కృష్ణ, చంద్రశేఖర్, కృష్ణయ్య, రాజేందర్, బాలసుబ్రహ్మణ్యం, సునీత, కృష్ణకుమారి, యాదమ్మ, లావణ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

● అమ్రాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ సుధారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హాజరైన ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ చైతన్య మాట్లాడుతూ మాతృభాష ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశంలో మూడవసారి ప్రధాని నరేంద్రమోదీనే

- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి


విజయసంకల్ప యాత్ర పోస్టర్ విడుదల చేస్తున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

కల్వకుర్తి, ఫిబ్రవరి 21 : దేశంలో నరేంద్రమోదీ మూడవసారి ప్రధాని కావడం ఖాయమని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. దేశ ప్ర జలంతా నరేంద్రమోదీ పాలనను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణం లోని బీజేపీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వి జయసంకల్ప యాత్ర వాల్ పోస్టర్‌ను బుధవారం తల్లోజు ఆచారి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న కల్వకుర్తికి బీజేపీ విజయ సం కల్ప యాత్ర వస్తుందని పేర్కొన్నారు. సాయంత్రం 4గంటల వరకు మార్చాల నుంచి కల్వకుర్తికి బైక్ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 21: మండల పరిధిలోని దేవుని తిర్మలాపూర్ గ్రామంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసా గుతున్నాయి. బుధవారం శ్రీదేవి భూదేవి సమేతంగా వేంకటేశ్వరస్వామిని హనుమంత వాహనంపై గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు శేషాచారిశర్మ తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆ గ్రామ మాజీ సర్పంచ్ వి.సత్యం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఉద్యోగాలు సాధించిన సోహేలొద్దీన్‌కు సన్మానం


సోహేలొద్దీన్‌ను సన్మానిస్తున్న మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

కల్వకుర్తి, ఫిబ్రవరి 21: టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించిన పరీక్షల్లో ఒకేసారి ఐదు ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమని కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్‌లు పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని విస్డమ్ పాఠశాలలో విద్యనభ్యసించిన సోహేలొద్దీన్ ఇటీవల టీఎస్‌పీఎస్‌సీ విడుదల చేసిన టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సర్ పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించాడు. అంతేకాకుండా సోహేలొద్దీన్ టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించిన పరీక్షల్లో 5 ఉద్యోగాలు సాధించాడు. సోహేలొద్దీన్‌ను మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్‌లు ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు ఆంటోనిమాత్యు, డైరెక్టర్లు రవీందర్, అఫ్జల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడ్డివాముకు నిప్పంటించిన దుండగులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 21 : కొల్లాపూర్ మండల పరిధిలోని జావాయిపల్లి గ్రామంలో కుమ్మరి గోపాల్ వ్యవసాయ పొలంలో నిల్వ చేసిన గడ్డివామును మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. విషయం తెలుసుకున్న పొలం యజమాని కుమ్మరి గోపాల్ ఫైర్ సిబ్బందికి బుధవారం ఉదయం సమాచారమివ్వగా ఘటన స్థలానికి చేరుకుని అంటుకుంటున్న గడ్డివామును ఫైర్ సిబ్బంది ఆర్పేశారు. గత మూడు నెలలుగా తన పొలంలో వేరుశనగ పంట వేసి తీసిన పంట గడ్డిని వ్యవసాయ పొలంలోనే నిల్వ చేశానని, ఇంతలో గుర్తు తెలియని దుండగులు గడ్డివామును దగ్ధం చేశారని సంఘటనపై కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని బాధితుడు కుమ్మరి గోపాల్ పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పూరి గుడిసెలు, పశుగ్రాసం దగ్ధం

లింగాల: మండల పరిధిలోని పద్మన్నపల్లిలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరి గుడిసెలు, పశుగ్రాసం దగ్ధమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన జాజాల ఈదన్న, జాజాల నారాయణ, బిచ్చయ్య అనే వ్యక్తులకు చెందిన గుడిసెలు, పశుగ్రాసం దగ్ధమై రూ. 2లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న అచ్చంపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన మాల ఉద్యోగుల ఐక్యవేదిక నూతన కమిటీ

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 21: అచ్చంపేట డివిజన్ మాల ఉద్యోగ ఐక్యవేదిక నూతన కమిటీ ఇటీవల ఏర్పాటు చేశారు. మాల ఉద్యోగుల ఐక్యవేదిక నూతన కమిటీ బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ నివాసంలో కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షుడు పంబలీ జీవన్ కుమార్, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా బందెల జనార్ధన్, గౌరవాధ్యక్షులు నారాయణ, అధ్యక్షులు కల్మూల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి శంకర్, ముఖ్యసలహాదారుడు రామస్వామి, లింగమయ్య, బాలయ్య, రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న థైలేరియా టీకాల పంపిణీ

చారకొండ, ఫిబ్రవరి 21: పశువైద్యశాఖ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో క్రాస్ బ్రీడ్ ఆవులకు థైలేరియా టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతున్నది. బుధవారం మండల పశువైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో 40 క్రాస్‌బ్రీడ్ ఆవులకు థైలేరియా టీకాలను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ పశువులకు థైలేరియా వ్యాధి సోకితే చాలా ప్రమాదమని రైతులు అప్రమత్తంగా ఉండి థైలేరియా సోకకుండా వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని పేర్కొన్నారు. క్రాస్‌బ్రీడ్ ఆవులు ఉన్న రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీఎల్‌వో షేక్ మదర్, సిబ్బంది శివరాం, గోపాలమిత్ర గిరియాదవ్, మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

కమిషనర్‌గా శ్యాంసుందర్ బాధ్యతలు


నూతనంగా బాధ్యతలు తీసుకున్న మునిసిపల్ కమిషనర్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 21: అచ్చంపేట మునిపాలిటీ కమిషనర్‌గా శ్యాంసుందర్ ఇటీవలే నూతనంగా బాధ్యతలు చేపట్టారు. బుధవారం మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్‌తో కలిసి కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మునిసిపాలిటీ కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి పట్టణ అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. పట్టణంలోని కాలనీలలో సమస్యలు ఉంటే ప్రజలు మునిసిపాలిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. సిబ్బంది నిత్యం కాలనీలలో పర్యవేక్షించి సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ నాయకులు తిరుపతి గౌడ్, మహబూబ్ అలీ, ఎండీ గౌస్, పాష, విష్ణు, అశోక్, నిరంజన్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మగ్గం శిక్షణ కార్యక్రమం తనిఖీ

తెలకపల్లి, ఫిబ్రవరి 21 : తెలకపల్లి మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగ్గం శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం అడిషనల్ డీఆర్‌డీవో లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ మగ్గం వర్క్ నేర్చుకొని సర్టిఫికెట్ పొంది తిరిగి బయట షాపులకు స్వయం సహాయ సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఏపీఎం బి.నిరంజన్, ట్రైనర్ ఫరీదా, సీసీ నిరంజన్, శిక్షకురాలు సునీత, సంగీత, నీలమ్మ, అలివేల, ఎల్లమ్మ, శివలక్ష్మీ, సభ్యులు ఉన్నారు.

వృద్ధులకు సంచార వైద్య శిబిరం

కందనూలు, ఫిబ్రవరి 21 : నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని మంతటి గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు సంచార వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సెక్రెటరీ రమేష్‌రెడ్డి మాట్లాడారు. సంచార వైద్య శిబిరంలో 92మందికి రక్తపరీక్షలు, బీపీ పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు పంపిణీ చేశారు. యూత్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ కుమార్, మెంబరు కృష్ణారావు, వైద్యాధికారులు కేశవులు, అనురాధ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో మహిళకు రెండేళ్ల జైలుశిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 21 : దొంగతనం కేసులో మంగలి లక్ష్మీకి రెండు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ. రెండువేల జరిమానా విధిస్తూ నాగర్‌కర్నూల్ ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ పుట్ట మౌనిక బుధవారం తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్లకు చెందిన మంగలి లక్ష్మీ 2016లో ఒక దొంగతనం కేసులో అనుమానితురాలుగా కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో ఆమె దొంగతనం చేసినట్లు రుజువైంది. ఈ కేసులో నిందితురాలికి 2ఏళ్ల జైలు శిక్షతోపాటు 2వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి పుట్ట మౌనిక తీర్పును వెలువరించినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి

అమ్రాబాద్, ఫిబ్రవరి 21: మహిళల జీవనోపాధి పెంపొందిస్తూ ఆర్థిక అభివృద్ధి కోసం ముమ్మరంగా కృషి చేయనున్నట్లు డీపీఎం శ్రీనివాసులు వెల్లడించారు. అమ్రాబాద్ మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉమ్మడి అమ్రాబాద్ మండల వీవోఏలకు లక్పతి దీదీ పథకంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ రిసోర్స్ పర్సన్స్ సంతోష్, ఏపీఎం రామ్‌రెడ్డి, సమాఖ్య ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్సీలో సముచిత స్థానం కల్పించాలి

మన్ననూర్, ఫిబ్రవరి 21: అడవులు, వన్యప్రాణుల సంరక్షణయే ధ్యేయంగా పనిచేస్తున్న అటవీ ఉద్యోగులకు పీఆర్సీలో సముచిత స్థానం కల్పించాలని అటవీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి పద్మారావు, సభ్యులు ముజీబ్ గోరి, భగ్న, రాంబాబు, వాల్యా, హన్మంతు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

కల్వకుర్తి, ఫిబ్రవరి 21 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని విద్యాపరంగా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీంకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

కల్వకుర్తి, ఫిబ్రవరి 21 : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం 3గంటలకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.యాదయ్యగౌడ్‌లు తెలిపారు. ఎంపికలకు వచ్చే క్రీడాకారులకు 85కేజీల లోపు బరువు కలిగి ఉండి, ఆధార్ కార్డుతో పాటు హాజరు కావాలని వారు కోరారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మార్చి 2 నుంచి 4వ తేదీ వరకు నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్‌లో జరిగే 70వ తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని వారు తెలిపారు.